స్కెలిటన్ గ్రూప్

వసుంధర

"ఇవేక్కడి ఎండలు బాబూ?" అన్నాడు గోపాలం.

చాలా కాలం తర్వాత అతను వేసవిలో కాకినాడ వచ్చాడు. అతడు ఉద్యోగరీత్యా ఉత్తరహిందూస్థానంలో వుంటున్నాడు. అతడుండే ప్రాంతంలో ఎండలు మరీ అతి తక్కువ కాకపోయినా — ఇలా వళ్ళంతా జిగురు జిగురుగా అయిపోయేలా చెమటలు పట్టవని అతడు శేఖరంతో అన్నాడు.

శేఖరం ఆరోగ్యంపాడై ప్రాణంమీదకు వచ్చింది. అతడు చచ్చిపోతాడనే అంతా అనుకున్నారు. గోపాలం అతడి ప్రాణస్నేహితుడు. గోపాలాన్ని ఓసారి చూడా లని వున్నదని శేఖరం కబురు పంపించాడు. గోపాలం వున్నవాడున్నట్లు వచ్చి కాకినాడ వాలాడు. అయితే అప్పటికి శేఖరం గండం గడిచి బయటపడ్డాడు.

శేఖరానికీ, గోపాలానికీ మధ్య మరో బంధమేర్పడ నున్నది. శేఖరం చెల్లెలు దుర్గ గోపాలాన్ని ఆకర్షించింది.

తన ఆకర్షణకు ప్రేమ అని పేరు పెట్టడమే కాక స్నేహితుడికి చెప్పుకున్నాడు గోపాలం.

ఈ ప్రేమను శేఖరం ఆమోదించడంకంటె — ఆ అదృష్టానికి ఆనందపడ్డాడనడం సబబు. ఎందుకంటే గోపాలం రెండు చేతులా సంపాదిస్తున్నాడు. అయిన వాళ్ళింకెవ్వరూ లేరు.

మిత్రుడు మృత్యుగండం నుంచి తప్పించుకోగానే గోపాలం మనసు దుర్గమీదకు లాగింది. అతడామెతో మాట్లాడడంకోసం తహతహలాడుతున్నాడు. అయితే ఆమె అతడికి ఏకాంతంలో దొరకడంలేదు. ఒకేఒక్కసారి కొరికింది. అప్పుడతడేదో అనబోయేలోగా దుర్గ — "అబ్బ — చెమట వాసన —" అని ముఖంలో అదోరకం భావం వ్యక్తంచేసింది.

ఆమె ఆ మాట అన్నప్పుడు ఇద్దరికీమధ్య మూడు గజాల దూరం ఉన్నది. నిజానికి చెమట వాసన దుర్గ ఒంటినుంచి కూడా వస్తున్నది. అందువల్ల గోపాలం కాస్త ఫీలయ్యాడు. అప్పుడే అన్నాడు — "ఇవెక్కడి ఎండలు బాబూ?" అని.

అలాగనడంలో అతడి ఉద్దేశ్యం తనవద్దనుంచి వచ్చే చెమట వాసనకు వాతావరణమేకానీ తన అపరిశుభ్రత కాదని ఆమెకు తెలియజెప్పడమూ — ఆ ఎండలు తననూ, ఆమెనూ ఒకేవిధంగా బాధిస్తున్నాయని సూచించడమూ!

అందుకు దుర్గ ఏమీ అనలేదు. అదోలా నవ్వి అతణ్ని తప్పించుకుని వెళ్ళిపోయింది. వచ్చిన ఓ మంచి అవకాశం ఇలా పోవడంతో గోపాలం హతాశుడయ్యాడు.

అతడు మొత్తం వారం రోజులు సెలవు పెట్టాడు. అందులో రెండు రోజులు ప్రయాణానికి పోయాయి.

మరో రెండు రోజులు ప్రయాణానికి పోతాయి. అనగా మూడు రోజులు మిగిలాయి. వాటిలో రెండవ రోజు నడుస్తున్నదిప్పుడు.

శేఖరం అనారోగ్యం పేరు చెప్పి ఇంటిలో చాలా మంది శేఖరం బంధువులు చేరారు. ఒక్కొక్కరే వెళ్ళి పోతున్నప్పటికీ మిగిలినవారి సంఖ్య గోపాలానికి ఇబ్బంది కలిగించేదిగానే వున్నది.

గోపాలం ఆ సాయంత్రం శుభ్రంగా స్నానం చేశాడు. అదృష్టవశాత్తూ వున్నట్లుండి గాలివీచడం ప్రారంభమయింది.

అతడు మళ్ళీ దుర్గను అన్వేషించి పట్టుకున్నాడు. ఆమె అతణ్ని చూసి ఇబ్బందిగా నవ్వింది.

"ఇప్పుడు నావద్ద చెమటవాసన లేదు—" అన్నాడతను.

"కానీ నావద్ద వున్నది—" అంటూ ఆమె అక్కణ్నించి వెళ్ళిపోయింది. గోపాలం ఆమె దారికి అడ్డంగా నిలబడ్డాడు.

ఆమె కదలకుండా అలాగే నిలబడిపోయింది.

"నేను నీతో మాట్లాడాలి—" అన్నాడు గోపాలం.

దుర్గ మాట్లాడలేదు.

"నీకు నేనంటే ఇష్టముందో లేదో చెప్పాలి—"

అప్పుడు దుర్గ సిగ్గుపడింది.

"ఇష్టమే కదూ—" అన్నాడు గోపాలం.

"ఊఁ" అన్నది దుర్గ.

"నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నాడు గోపాలం.

"ఛీ—" అన్నది దుర్గ.

"ఛీ అనొద్దు—ఇష్టమో కాదో చెప్పు—" అన్నాడు గోపాలం.

"నేను చెప్పను—" అన్నది దుర్గ.

"ఎందుకని?"

"నాకిష్టంలేదు—"

గోపాలం ఉలిక్కిపడి—"నన్ను పెళ్ళిచేసుకోవడం నీకిష్టంలేదూ?" అన్నాడు.

"అది చెప్పడం నాకిష్టంలేదు—" అని తుర్రున పారి పోయింది దుర్గ.

గోపాలం తెల్లబోయాడు. అయితే తనకు కాస్త దూరంలో ఓ వ్యక్తి తనను గమనిస్తూన్న విషయం అతడికి తెలియదు.

2

"దుర్గా!" అన్నాడతను కాస్త కోపంగా.

"ఏం బావా—అంత కోపంగా వున్నావు—" అంది దుర్గ.

"కోపమంటే కోపమే మరి—వాడికి నీతో అంత చనువేమిటి?"

"వాడంటే—"

"వాడే—ఆ గోపాలంగాడు...."

"గోపాలమా?" అంది దుర్గ — "నా అన్నయ్య అతడికే నన్ను ఇచ్చి పెళ్ళిచేయాలనుకుంటున్నాడు...."

"నీ అన్నయ్య అనుకుంటే నీకిష్టమేనా?"

దుర్గ తమాషాగా నవ్వి ఊరుకుంది.

"అలా నవ్వడంకాదు. నువ్వు నన్ను చేసుకుంటావో-వాణ్ని చేసుకుంటావో ఈ క్షణమే తేలిపోవాలి—" అన్నాడతను.

"అన్నయ్య కట్నమివ్వడు. నేను అన్న మాట కాదన లేను. మీ నాన్నకు కట్నం కావాలి. నువ్వు తండ్రిమాట కాదనలేవు. మన పెళ్ళి ఎలా జరుగుతుంది?"

"ఎలాగో జరుగుతుంది! ముందు నేనంటే నీకిష్టమో కాదో చెప్పు—"

"ఆ మాట పెళ్ళయ్యాక చెబుతాను—" అని దుర్గ అక్కణ్నించి వెళ్ళిపోయింది. ఆమె వెంట నడువబోయిన ఆమె బావ వెనుకనుంచి తన భుజంమీద ఎవరిదో చేయి పడటంతో వెంటనే ఆగి వెనక్కు తిరిగాడు.

శేఖరం నవ్వుతూ—"దుర్గ నా చెల్లెలు—" అన్నాడు.

అతను—"నాకు తెలుసు—" అన్నాడు.

"నేను నిన్ను ద్వేషిస్తున్నాను-" అన్నాడు శేఖరం.

"నాకు తెలుసు—" అన్నాడతను.

"నీకు తెలియని దొకటుంది—" అన్నాడు శేఖరం.

"ఏమిటది?"

"అది నాకూ తెలియదు—" అని వెళ్ళిపోయాడు శేఖరం.

దుర్గ బావ అక్కడే నిలబడిపోయి శేఖరం మాటల్లోని అంతర్యం ఆలోచిస్తున్నాడు.

తను దుర్గ విషయంలో అదుపు దాటితే తనేంచేస్తాడో తనకే తెలియదని శేఖరం తన్ను హెచ్చరించాడా?

3

"నడివీధిలో పడకలేమిట్రా?" అన్నాడు శేఖరం.

"నీకైతే ఇంట్లో పడుకోవడం ఎలాగూ తప్పదు. నాకేం కర్మ—నిన్న రాత్రి వుక్కపోయాను. ఈ రోజు ఏమైనా సరే వీధిలో పడుకోవలసిందే—" అన్నాడు గోపాలం.

"ఇంకెవరైనా వీధిలో పడుకుంటున్నారా?" అన్నాడు శేఖరం.

"సత్యంగారు పడుకుంటారట—" అన్నాడు గోపాలం.

"వాడా! సరే.... వాడికి నువ్వంటే ఏమాత్రంపడదు- ఆ సంగతి నీకు తెలుసా?" అన్నాడు శేఖరం.

"ఏం—?" అన్నాడు గోపాలం ఆశ్చర్యంగా.

"వాడు దుర్గను ప్రేమిస్తున్నాడు...." అన్నాడు శేఖరం.

"ఓహో! ఆయన దుర్గ బావ కదూ—నాకీ విషయమే స్ఫురించలేదు—"

"దుర్గకే కాదు. నాకూ బావే వాడు—" అన్నాడు శేఖరం.

"అవునవును—" అన్నాడు గోపాలం.

"కానీ వాడంటే నాకు అసహ్యం—"

"ఏం?"

"వాడికి దుర్గ కావాలి. కానీ దుర్గకోసం ఏమీ వదులుకోలేడు—"

"అంటే?"

"వాడి నాన్నకు కట్నం కావాలి. నేను కట్నమివ్వనని చెప్పేశాను. కట్నం ఎగేయడంకోసం సత్యాన్ని ఎరవేసి పట్టానని వాళ్ళ నాన్న అన్నాడు. నా చెల్లెలు తళుకు బెళుకులతో వాణ్ణి వశపర్చుకోవాలనుకుందిట. ఆయనలాగన్నప్పుడు వాడేమీ మాట్లాడలేదు. ముంగిలా కూర్చున్నాడు. మీ నాన్న మాటల్ని ఖండించరా అని నిలదీశాను. అయినా ఏమీ అనలేదు—"

"పాపం—తండ్రి చాటు బిడ్డ కాబోలు-" అన్నాడు

గోపాలం.

"అలాంటి వాళ్ళనుంచే ఆడవాళ్ళకు ప్రమాదం—"

అన్నాడు శేఖరం.

"మంచి విషయం చెప్పావు. రాత్రి నేను సత్యాన్ని ఆటపట్టిస్తాను. అతిడి గురించి ఏమీ ఎరుగనివాడిలా నటిస్తూ అతడిలాంటి మగాళ్ళని దుమ్మెత్తిపోస్తాను—"

"అలా ఉత్సాహపడకు. వాడు చాలా ప్రమాదకర మైన మనిషి. నాకు బాగా తెలుసు. వాణ్ని ఆవేశ పెడితే ఆ ఆవేశంలో ఏమైనా చేస్తాడు...." అన్నాడు శేఖరం.

"ఆవేశపరులను ఆపడం నాకు తెలుసు—" అన్నాడు గోపాలం.

4

గోపాలం మడత మంచం తీసుకు వేందుకు గదిలోకి వెడితే అక్కడ దుర్గ వుంది. ఆమె అతణ్ని చూస్తూ—

"మీరు వీధిలో పడుకోవద్దు—" అంది.

"ఏం?" అన్నాడు గోపాలం.

"వీధిలో సత్యం బావకూడా పడుకుంటున్నాడు—".

అన్నదామె.

"పడుకుంటే నాకేం?"

"వాడికి మీరంటే కోపం—"

"ఎందుకని?"

"ఎందుకో అందుకు—నా మాట విని మీరీ గదిలోనే పడుకోండి. మీ కోసం ఓ ఫ్యాను కూడా ఏర్పాటు చేస్తాను" అంది దుర్గ.

"చెమట వాసన.... భరించలేను...." అన్నాడు గోపాలం.

"చాలా తెలివిగా మాట్లాడుతున్నారులెండి. మీరు

లోపల పడుకు నేమాటైతే...." అంది దుర్గ.

"అయితే?"

"రాత్రి నేను మీతో కాసేపు మాట్లాడతాను...."

గోపాలం తనువు పులకించినట్లయింది. ఈమె తనను ఆశ పెడుతోంది. ఎందుకు? సత్యం నిజంగా ప్రమాదకర మైన మనిషా? లేక రాత్రి ఆమె నిజంగా తనతో మాట్లాడాలనుకుంటున్నదా?

అతడి ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. ఆమె అతడితో ఏదో చెప్పాలని అనుకుంటున్నది. అది నూటిగా చెప్పలేక ఇలా సత్యం గురించి చెబుతున్నది.

"థాంక్స్!" అన్నాడు గోపాలం.

"రాత్రి ఇంట్లో పడుకుంటే నేనే మీకు థాంక్స్ చెబుతాను—" అంది దుర్గ.

"చూడండి—" అన్నాడు గోపాలం—"ఈ ఎండలు అలవాటు తప్పి కొన్నేళ్ళయింది. ఈ ఉక్క నేను భరించలేకపోతున్నాను. మీతో మాట్లాడ్డంకోసం నేనీ గదిలో పడుకోగలను. కానీ మీరు లేకుండా ఒక్క క్షణం కూడా ఇక్కడి ఉక్క భరించలేను. ఫ్యాన్ వున్నా భరించలేని వేడి ఇది. మీరు రాత్రి ఎన్నింటికి నాతో మాట్లాడతారో చెప్పండి. సరిగ్గా అన్నింటికి నా పక్క లోపలకు మారుస్తాను—"

ఏమనుకున్నదో—"రాత్రి ఒంటి గంటకు—" అంది దుర్గ.

గోపాలం మంచం తీసుకుని వీధిలో వేసుకున్నాడు. సత్యం అప్పటికే అక్కడ పడుకుని వున్నాడు. వీధి తలుపు తాళంవేసి చెవి తన జేబులో వుంచుకున్నాడు గోపాలం.

సత్యం కదలడంలేదు.

"బాగా నిద్రపట్టి వుండాలి—" అనుకున్నాడు గోపాలం. అతను తనూ పక్కమీద వాలాడు.

పెద్దగా గాలివేయడంలేదు. వీధిలో కూడా అంత బాగోలేదు. ఎటొచ్చీ లోపల పట్టినట్లుగా చెమటలు లేవు.

గోపాలానికి సత్యాన్ని లేపి ఏమైనా అనాలని వున్నది. అందుకు రెండు కారణాలున్నవి. తను ప్రేమించిన దుర్గను అతడూ ప్రేమించడం ఒకటి. దుర్గను అతడు అవమానించడం రెండవది.

"సత్యంగారూ!" అన్నాడు గోపాలం నెమ్మదిగా.

సత్యం ఉలకలేదు. పలకలేదు.

గోపాలానికి అతణ్ని తట్టి లేపాలని అనిపించింది. అతికష్టంమీద అతడా కోరికను నిగ్రహించుకున్నాడు.

అతడు తన చేతికి వున్న ఎలక్ట్రానిక్ వాచ్‌లోని అలారం సరిగ్గా ఒంటిగంటకు మ్రోగేలా ఏర్పాటు చేసుకున్నాడు. అతడి ఆలోచనలు సత్యాన్ని వదిలి దుర్గ చుట్టూ తిరగసాగాయి.

దుర్గ తనతో ఏం మాట్లాడుతుంది?

రాత్రి ఒంటిగంటకు తనకు ఎటువంటి అనుభవం రాసిపెట్టి వుంది?

మనసు కలలు కనమని ప్రోత్సహిస్తున్నదో ఏమో అతడికి త్వరగా నిద్రపట్టింది. అతడలా ఎంతసేపు నిద్రపోయాడో ఏమోకానీ ఓ రాత్రివేళ ఎవరో అతణ్ని తట్టి లేపారు. ఉలిక్కిపడి కళ్ళు నులుముకుని అతడు ముందు తన్ను తట్టిలేపిన మనిషిని చూశాడు.

"మీ జేబులో తాళంచెవి ఓసారిలా ఇవ్వండి—"

అన్నాడు సత్యం.

గోపాలానికి కళ్ళు మూతలు పడుతున్నాయి. చాలా మత్తుగా వున్నదతడికి.

తాళంచెవి ఇస్తూ సైయు చూసుకున్నాడు. పదకొం డున్నర అంది.

తను దుర్గను కలుసుకోనడానికి చాలా టైమున్నది.

"తాళం చెవి మీ తలగడక్రింద వుంచుతాను—" అన్నాడు సత్యం.

"ఊఁ" అన్నాడు గోపాలం. అతడింకేమీ వివరా లడగలేదు. నిద్రమత్తు ప్రభావం అటువంటిది.

సత్యం ముందు లోపలకు వెళ్ళాడు. ఓ పదినిమిషా లుండి ఒక్కడూ మళ్ళీ బయటకు వచ్చాడు. ఈసారి అతడు మడతమంచం లోపలకు తీసుకుని వెళ్ళాడు. మళ్ళీ బయటకు వచ్చి తాళంచెవిని గోపాలం తలగడక్రింద వుంచాడు.

అప్పుడు సత్యం ఒక్క క్షణం ఆగాడు. గోపాలాన్ని పరీక్షగా చూశాడు. అతడు మంచి నిద్రలో ఉన్నట్లు తెలుస్తున్నది. కానీ....

"ఎందుకైనా మంచిది...." అనుకున్నాడు సత్యం. అతడి జేబులోంచి చిన్న సీసా బయటకు తీశాడు. దాని మూత తీశాడు.

సీసాను గోపాలం ముఖంమీదకు వుంచి రెండుసార్లు మెత్తగా నొక్కాడు. తుస్సుమని చప్పుడయింది.

ఇప్పుడు గోపాలం గాఢనిద్ర పోతున్నవాడిలాకాక చచ్చినవాడిలా పడున్నాడు. సత్యం తృప్తిగా నిట్టూర్చి లోపలకు వెళ్ళిపోయాడు.

5

ఇన్ స్పెక్టర్ భానోజీరావు కుర్చీలో కూర్చుని—
"మా పనులన్నీ అయ్యాయి. ఇంక మీరు మా ప్రశ్నలకు జవాబు చెప్పవలసి వున్నది—" అన్నాడు.

అక్కడ శేఖరం, సత్యం, దుర్గ కాక పదిమంది వున్నారు. భానోజీరావు ముందా పదిమందినీ కొన్ని ప్రశ్నలు వేసి పంపించేశాడు. వాళ్ళనుంచి అతడికి తగిన సమాచార మేదీ లభించలేదు.

మిగిలిన ముగ్గురిలోనూ భానోజీరావు దుర్గను ముందు ప్రశ్నించాడు. దుర్గ కాసేపు ఏమీ మాట్లాడలేదు.

"మీరలా మౌనం వహిస్తే ఏమీ లాభంలేదు. ఒకో సారి మీరు మామూలు సమాచారం అనుకున్నది మాకెంతో ప్రయోజనకారి కావచ్చు...." అన్నాడు భానోజీరావు.

"అడగండి—" అంది దుర్గ.

"గోపాలం గురించి మీకు తెలిసినదంతా చెప్పాలి-"

"అతడు నన్ను ప్రేమించాడు. పెళ్ళిచేసుకుంటా నన్నాడు. విషయం అన్నయ్యతో చెప్పాడు. అన్నయ్య అంగీకరించాడు—"

"మీ సంగతేమిటి?"

"చిన్నప్పట్నించీ నాకు నా బావంటే ఇష్టం—బావకూ నేనంటే ప్రేమ. బావకు నన్ను పెళ్ళిచేసు కోవాలని వుంది. కానీ తండ్రి కట్నం కావాలంటే కాదనలేకపోతున్నాడు. అందుకని అన్నయ్యకు అత డంటే ద్వేషం—"

"అంటే మీ అన్నయ్య కట్నమిచ్చి బావతో పెళ్ళి జరిపించాలని మీరు కోరుకుంటున్నారా?" అన్నాడు

భానోజీరావు.

"ఊఁ" అన్నది దుర్గ.

"ఒకవేళ మీ అన్నయ్య గోపాలంతో పెళ్ళి జరిపి వే సంతోషించి వుండేవారా?"

"చెప్పలేను—"

"గతరాత్రి మీరు గోపాలంతో మాట్లాడేరా?"

దుర్గ ఒక్కక్షణం ఆలోచించి—"లేదు—" అన్నది.

"వీధిలో గోపాలం, మీ బావ సత్యం—ఇద్దరూ పడుకున్నారు. కానీ ఒక రాత్రివేళ సత్యం ఇంట్లోకి వచ్చేశాడు. ఆ తర్వాత ఓలారీ ఆ వీధిలోంచి వెడుతూ—గోపాలం మంచాన్ని గుద్దేసింది. గోపాలం వెంటనే మరణించాడు. ఈ సంఘటనపై మీ అభిప్రాయమేమిటి?"

"యాక్సిడెంట్!" అంది దుర్గ.

"సత్యం ముందుగా లోపలకు రావడం...."

"యాక్సిడెంటల్ ...." అన్నదామె.

"మీరు వెళ్ళొచ్చు—" అన్నాడు భానోజీరావు.

దుర్గ వెళ్ళింది. శేఖరం వచ్చాడు.

"సత్యం ప్రమాదకరమైన మనిషి. ఇందులో వాడి చేయి వున్నదీ లేనిదీ నాకు తెలియదు. కానీ...." అని ఆగిపోయాడు శేఖరం.

"కానీ...." అన్నాడు భానోజీరావు.

"వాడు గోపాలాన్ని చంపాలని అనుకున్నట్లు నాకు తెలుసు— ...."

"ఎలా?"

"దుర్గ పెళ్ళి ఎవరితో కుదిర్చినా ఆ వరుణ్ని బ్రతకనివ్వనని సత్యం నాతో చాలాసార్లు అన్నాడు—"

"ఎందుకని?"

“కట్నమివ్వడానికి తగిన డబ్బు నావద్ద వున్నదట. అందుకని తన తండ్రి కట్నమడగడంలో తప్పులేదని వాడి వాదన—....”

“అవునూ — మీరు సత్యానికి కట్నమివ్వకూడదని ఎందుకనుకున్నారు?” అన్నాడు భానోజీరావు.

“కట్నమిస్తే వాడికే ఎందుకివ్వాలన్నది నా బాధ! అదీకాక గోపాలాన్ని నేను చిన్నతనంనుంచీ ఎరుగుదును. వాడు యోగ్యుడు. కానీ కట్నంలేకుండా నా చెల్లెల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. అలాగని వాడికే మైనా లోపాలున్నాయా అందామంటే కట్నాల బజార్లో వాడి రేటు — ముప్ఫైవేలదాకా వుంది. అలాంటివాడుండగా కట్నమిచ్చి సత్యానికివ్వాల్సిన కర్మ నాకేమిటి?”

భానోజీరావు క్షణం ఆలోచించి—“సత్యం గోపాలాన్ని చంపి వుండవచ్చునని మీరనుకుంటున్నారా?” అన్నాడు.

శేఖరం ఎంతోసేపు ఆలోచించలేదు—“రాత్రి నేనో దృశ్యం చూశాను—” అన్నాడతడు—“సత్యం లోపలకు మంచం మార్చుకుని గోపాలం ముఖంమీదకు ఏమో స్ప్రే చేశాడు. మధ్యలో నిద్ర చెడిపోయినపుడు నేనా దృశ్యం చూశాను. అప్పుడు దాని గురించి ఎక్కువ ఆలోచించాలనుకోలేదు. అయితే ఈ ప్రమాదం జరిగిన వెంటనే నాకా విషయం గుర్తుకు వచ్చింది—”

భానోజీరావు ఉత్సాహంగా—“మీరు చెప్పిందంతా నేను జాగ్రత్తగా నోట్ చేసుకుంటున్నాను. నిద్ర మత్తులో మీరు భ్రమపడడం లేదుగదా!” అన్నాడు.

“లేదు. కానీ అప్పుడే నా బుర్ర పదునెక్కి వుంటే

ఈ ప్రమాదం జరిగివుండేదికాదు కదా అనిపిస్తోంది—"
అన్నాడు శేఖరం బాధగా.

"ఇంకా ఏమైనా చెప్పగలరా మీరు?" అన్నాడు భానోజీరావు.

"లారీ డ్రైవర్‌గా భావించబడుతున్న తాళాల గుత్తిమీద పుర్రె బొమ్మ వున్నదిగదా—అది స్కెలిటన్ గ్రూపుదని మీరే అన్నారు. స్కెలిటన్ స్మగ్లింగ్ గ్రూప్ నాయకుడు వరాలయ్య అని చాలామంది చెప్పు కుంటారు కానీ పోలీసులవద్ద అందుకు సరైన ఆధారాలు లేవు. నాకు తెలిసినదల్లా మా సత్యానికీ వరాలయ్యాకూ మంచి స్నేహం వున్నదన్న విషయం...." అన్నాడు శేఖరం.

"అంటే మీరు చెప్పేదేమిటి?"

"గోపాలాన్ని వీధిలో పడుకోమని ప్రోత్సహించింది సత్యం. తనూ అతడితోపాటు కాసేపు పడుకుని ఓ రాత్రివేళ లోపలకు వచ్చేకాడు. దీని అంతరార్థం మీరే ఆలోచించండి. ఈ విషయమై ఇంక నేనేమీ చెప్ప లేను—" అన్నాడు శేఖరం.

భానోజీరావు శేఖరాన్ని పంపించేసి సత్యాన్ని రప్పించాడు.

"గోపాలం చావుపై మీ అభిప్రాయం—"

"యాక్సిడెంట్—"

"కొంతసేపు వీధిలో పడుకుని తర్వాత మీరు బయట నుంచి లోపలకు పోవాలనుకోవడం...."

"యాక్సిడెంటల్—"

"మీ మరదలు దుర్గ కూడా సరిగ్గా ఇవే పదాలు ఉపయోగించింది—"

"ఆమె నా మరదలు-"అన్నాడు సత్యం గర్వంగా.

"మీ ఇద్దరిదీ ఒకేమాట కావచ్చు. కానీ ఇద్దరూ తప్పే చెప్పారు. మీరు ఇంట్లో పడుకోబోతూ గోపాలం ముఖంమీద మత్తు మందు స్ప్రే చేయడం ఒకరు చూశారు—"

సత్యం తెల్లబోతూ—"ఎవరు?" అన్నాడు.

"చెప్పింది ఎవరైనప్పటికీ—అది నిజం!" అన్నాడు భానోజీరావు.

"నిజమే—" అన్నాడు సత్యం నీరసంగా.

"ఎందుకలా చేశారు?"

"దుర్గ గోపాలాన్ని రాత్రి ఒంటిగంటకు కలుసుకోవాలనుకుంది—"

"ఎందుకు?"

"నాకు తెలియదు—"

"అయితే మీరు గోపాలంమీద మత్తుమందు ఎందుకు జల్లారు?"

"అతడికా సమయానికి మెలకువ రాకూడదని...."

"వస్తే ఏమవుతుంది?"

"దుర్గకు అన్యాయం జరుగుతుంది!"

"ఇంతమంది వున్న ఇంట్లో దుర్గకు అన్యాయం ఎలా జరుగుతుంది?"

సత్యం తల వంచుకుని — "దుర్గ సంగతి తెలిస్తే మీరిలా అనేవారు కారు—" అన్నాడు.

"చెప్పండి—" అన్నాడు భానోజీరావు.

"మగవాడు చొరవచేస్తే దుర్గ అభ్యంతరం పెట్టదు...."

"మీకెలా తెలుసు?"

"అనుభవంమీద చెబుతున్నాను...."

"అంటే?"

"మీరనుకునేది నిజం. దుర్గ ఏనాడో నాదయింది.."

"ఆమె మీమీద ప్రేమకొద్దీ మీకు లొంగిపోయిందేమో...." అన్నాడు భానోజీరావు. అయితే ఈ కొత్త విశేషం అతడిని ఆశ్చర్యపరుస్తున్నది.

"నిజం చెబుతున్నాను. నాకు చాలామంది ఆడవారితో పరిచయం వున్నది. దుర్గ నామీది ప్రేమతో నాకు లొంగిపోలేదు. అటువంటి ఏకాంతం లభిస్తే ఏ మగవాడికైనా ఆమె లొంగిపోయి వుండేది-" అన్నాడు సత్యం.

భానోజీరావు అతడివంక ఆశ్చర్యంగా చూశాడు. సత్యం కళ్ళలో నమ్మకం కొట్టవచ్చినట్లు కనబడింది.

"మీ అభిప్రాయం తప్పని నా ఉద్దేశ్యం—" అన్నాడు భానోజీరావు.

"తన బలహీనత గురించి దుర్గకు కూడా తెలుసు—" అన్నాడు సత్యం—"అందుకే ఆమె మగవాళ్ళకు సాధ్యమైనంత దూరంగా వుండడానికి ప్రయత్నిస్తుంది. ఏకాంతానికి ప్రయత్నించినా సాధ్యపడనివ్వదు. నిన్న రాత్రి ఆమె గోపాలంతో మాట్లాడుతూంటే ఆమె కనులు చూశాను. ఆ కళ్ళలో అతడిపట్ల జాలి కనబడింది. ఆ జాలి దేనికి దారితీస్తుందో నాకు తెలుసు...."

"ఆమె కారణం ఏమిటో అతడికి చెప్పలేదా?"

"అతడికి ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. నిజం చెప్పాలంటే ఆ ప్రమాదం నావల్ల వున్నదని అతడికి చెప్పిందామె—" అన్నాడు సత్యం.

భానోజీరావు తెల్లబోయి — "ఏమన్నారూ?"
అన్నాడు.

"మీరా విషయం సీరియస్‌గా తీసుకోకండి. దుర్గకు గోపాలాన్ని ఏకాంతంగా కలుసుకుని మాట్లాడాలనిపించింది. అందుకామె నోటికి వచ్చిన అబద్ధం చెప్పింది. విశేషమేమిటంటే ఆమె అతడిని ప్రమాదం గురించి హెచ్చరించింది. అది నిజంగానే జరిగింది— ...."
అన్నాడు సత్యం.

భానోజీరావు ఆలోచనలో పడ్డాడు. సత్యం తీరి కూర్చుని తన ప్రాణం మీదకు వచ్చే విషయమొకటి చెప్పాడు. ఎందుకు? అతడు నిజంగా నిర్దోషా? లేక ....

దుర్గ గోపాలంతో ఏం మాట్లాడిందో అతడు విన్నాడు. ఈ విషయం తనకు తెలిసింది కాబట్టి తను మళ్ళీ దుర్గను ప్రశ్నించవచ్చు. అప్పుడామె ఈ విషయం చెప్పవచ్చు. ఆ విషయం పసిగట్టి ముందుగానే తనే ఈ విషయం చెప్పేకాడా?

భానోజీరావు ఆలోచిస్తూ — "గోపాలం ప్రమాదవశాత్తూ మరణించలేదనీ—ఒక పథకం ప్రకారం హత్య చేయబడ్డాడనీ నేననుకుంటున్నాను. నా అభిప్రాయంతో ఏకీభవించమని మిమ్మల్ని అడగడంలేదు. ఈ హత్య ఎవరు చేసివుండవచ్చునని మీరు అభిప్రాయపడుతున్నారు?"
అన్నాడు.

"నేనేమీ చెప్పలేను—" అన్నాడు సత్యం.

"పోనీ—ఈ హత్యవల్ల లాభంపొందే వారెవరైనా వున్నారా?"

ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు సత్యం.

ఈ హత్యవల్ల లాభం పొందేవాడు సత్యం మాత్రమే!

అదైనా ఎటువంటి లాభం? తన్ను ప్రేమించి తనకు శరీరాన్నర్పించిన ఓ అమ్మాయిని గోపాలం పెళ్ళిచేసుకో కుండా ఆపడం....ఏమిటో—హత్యకు ఇదే కారణమంటే నమ్మబుద్ధి కావడంలేదు....

"ఇది హత్య అని నేననలేను. కానీ గోపాలం చావు వల్ల ప్రయోజనం పొందే వ్యక్తి ఎవరో నాకు తెలుసు-" అన్నాడు సత్యం.

"ఎవరు?" అన్నాడు భానోజీరావు.

"గోపాలం బాగా డబ్బు సంపాదిస్తున్నాడు. తను సంపాదించిందంతా అతను ఈ ఊళ్ళోని ఎకౌంట్‌కు మెయిల్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాడు. అయిదారేళ్ళతర్వాత ఇక్కడే పెద్ద వ్యాపారం ప్రారంభించాలని అతడి ఆలోచన—"

"అయితే?"

"ఆ అకౌంట్‌కు నామినీ శేఖరం—" అన్నాడు సత్యం.

అంటే—గోపాలం చనిపోతే ఆ డబ్బు శేఖరానికి వస్తుందన్నమాట-అనుకున్నాడు భానోజీరావు. అతగాడి పోలీసు బుర్ర చురుగ్గా పనిచేయసాగింది—"ఆ అకౌంట్లో డబ్బెంత వుండవచ్చు?"

"లక్షరూపాయలున్నా నేనాశ్చర్యపోను-" అన్నాడు సత్యం.

"మీ మనసులో ఏదో వుంది. వివరంగా చెప్ప గలరా?"

సత్యం గొంతు సవరించుకుని — "సుగణా, నాకూ శారీరక సంబంధం ఏర్పడిన సంగతి శేఖరానికి తెలుసు.

అందుకే నేను కట్నం గురించి పట్టుబడుతున్నానని అతడి అనుమానం. అయితే దుర్గను అన్యాయం చేసే ఉద్దేశ్యం నాకు లేదు. మా నాన్నకు నిజంగా డబ్బు అవసరం వుంది. ఆ డబ్బు రాబట్టడానికి నా పెళ్ళి ఒక్కటే ఆయనకు దారి. ఆయన నామీద ఎన్నో ఆశలు పెట్టుకుని చదివించాడు. ఆయనను నేనెలా నిరుత్సాహపర్చగలను. పోనీ అంటే శేఖరం లేనివాడు కాదు...." అన్నాడు.

"శేఖరానికి భూములున్నాయా?" అన్నాడు భానోజీ రావు.

"లేవు—"

"తండ్రి ఇచ్చిన ఆస్తి వుందా?"

"లేదు—"

"మరి అతడు ఆస్తిపరుడెలాగయ్యాడు?"

సత్యం చిన్నగా తగ్గి—"శేఖరం అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నాడు—" అన్నాడు.

"అక్రమంగా అంటే?"

"అందరూ లోపాయికారీగా స్కెలిటన్ గ్రూప్ నాయకుడని చెప్పుకుంటుండే వరాలయ్యతో శేఖరానికి మంచి దోస్తీ వుంది—" అన్నాడు సత్యం.

భానోజీరావు తెల్లబోయాడు.

స్కెలిటన్ గ్రూప్‌తో సత్యానికి సంబంధముందని శేఖరం అన్నాడు. శేఖరానికి ఆ గ్రూప్‌తో సంబంధముందని సత్యం అంటున్నాడు.

అసలు ఈ స్కెలిటన్ గ్రూపు గురించి ఆరాతీసే దాకా ఈ యింట్లో వాళ్ళనింకేమీ అడక్కూడదని అతడనుకున్నాడు.

6

ఇన్‌స్పెక్టర్ భానోజీరావు స్టేషన్‌కు వెళ్ళగానే స్కెలిటన్ గ్రూప్‌కు సంబంధించిన ఫైల్సు తిరగేశాడు.

రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమయింది ఆ గ్రూపు. అయిదు బ్యాంకు దోపిడీలకు ఆ గ్రూపుతో సంబంధమున్నదని అనుమానం. సుమారు ఇరవై హత్యలకు ఆ గ్రూపు కారణమని అనుమానమున్నది.

అఫీషియల్‌గా ఇంతే తెలిసినప్పటికీ — రాష్ట్రంలో జరిగే అనేక ఘోరాలకూ, నేరాలకూ ఈ గ్రూపు ప్రోత్సాహమున్నదని చెప్పుకుంటారు. ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి ఆధ్వర్యంలో ఈ గ్రూపు నడుస్తున్నట్లు అంతా అనుకుంటూంటారు. కాకినాడకు సంబంధించినంత వరకూ వరాలయ్యమీద కొంత అనుమానమున్నది. అయితే ఏ అనుమానానికీ సరైన ఆధారాలు లేవు.

పుత్తె ఆ గ్రూపుకు గురు అని చెప్పుకుంటారు. అయితే ఆ గురును ప్రత్యేకంగా ఏ నేరం చేయడానికిగానీ, వ్యక్తులను బెదిరించడానికిగానీ వాడలేదు. అంతవరకూ లభించిన ఆధారాలనుబట్టి చూస్తే—అసలు స్కెలిటన్ గ్రూప్ అనేది ఉన్నదా లేక అది కేవలం ఊహాజనితమా అని కూడా అనుమానం కలుగుతుంది.

రెండు సంవత్సరాల క్రితం ఆ గ్రూపు ఉనికి గురించి అనుమానం తగిలినప్పుడు పోలీస్ డిపార్టుమెంట్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌ను అందుకు నియమించింది. రెండు వారాల్లోనే ఆసక్తికరమైన విషయాలు తెలుసుకున్నానంటూ అతడినుంచి రిపోర్టు అందింది. రిపోర్టు అందిన ఇరవై నాలుగు గంటల్లో అతడో యాక్సిడెంట్లో మరణించాడు. దానిపై దర్యాప్తు చేయడానికి ఇన్‌స్పెక్టర్

సత్యారావు నియమించబడ్డాడు. అతడూ స్కెలిటన్ గ్రూప్ ఉనికిని నిర్ధారించి-ఆ వెంటనే ప్రమాదవశాత్తూ మరణించాడు. అలా అయిదుగురయ్యారు.

ఆరోవాడైన మోహన్ మాత్రం తను పరిశోధించి—స్కెలిటన్ గ్రూప్ ఉనికి అనుమానాస్పదమనీ—అంతవరకూ మరణించిన అయిదుగురి చావుకీ — స్కెలిటన్ గ్రూప్‌కీ ఏ సంబంధమూ లేదనీ నిర్ధారించాడు.

ఇన్స్పెక్టర్ భానోజీరావు మోహన్‌ని కలుసుకోవాలనుకున్నాడు. అందుకు అతడికి ఎంతోసేపు పట్టలేదు. మోహన్ చాలా త్వరగా లైన్లో దొరికాడు.

"హలో మిస్టర్ మోహన్! నేను మీతో చాలా అర్జంటుగా మాట్లాడాలి. మనం యెక్కడ కలుసుకుందాం?—" అన్నాడు భానోజీరావు.

"మా యింటికి రండి—" అన్నాడు మోహన్.

ఇన్స్పెక్టర్ మోహన్ రాజమండ్రిలో వుంటున్నాడు. భానోజీరావు అతడిల్లు చేరుకునేందుకు మూడు గంటలు పట్టింది.

ఇద్దరూ పరస్పరం పరిచయం చేసుకున్నారు.

"ఏమిటి విశేషం?" అన్నాడు మోహన్.

"నాకు మీరు సహకరించాలి—" అన్నాడు భానోజీరావు.

"ష్యూర్!" అన్నాడు మోహన్.

"బహుశా నేనడిగే ప్రశ్నలు కొన్ని మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టవచ్చు—"

"నా ఇబ్బంది సంగతి ఎలా వున్నా అడగడానికి మీరు చాలా ఇబ్బంది పడుతున్నట్లు అనిపిస్తుంది—" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"అందుకు కారణం స్కెలిటన్ గ్రూప్-" అన్నాడు భానోజీరావు.

మోహన్ పెదాలపై చిరునవ్వు మాయమయింది—"అదేమిటి?" అన్నాడు గంభీరంగా.

"స్కెలిటన్ గ్రూపు గురించి మీకు తెలిసింది చెప్పాలి—"

"నాకు తెలిసినంతవరకూ అలాంటి గ్రూపు ఏదీ లేదు—"

భానోజీరావు నవ్వి—"స్కెలిటన్ గ్రూప్ గురించి మీరు ఇన్వెస్టిగేట్ చేశారన్న విషయం మరిచిపోకూడదు—" అన్నాడు.

అప్పుడు మోహన్ నవ్వి—"నేను ఇన్వెస్టిగేట్ చేసి తెలుసుకున్నదేగదా — ఇప్పుడు మీకు చెప్పాను—" అన్నాడు.

"అది నాకు తెలుసు. అయితే మరో విషయం నన్నాశ్చర్య పరుస్తున్నది. మీకు ముందు అయిదుగురు పోలీసాఫీసర్లు ఇదే విషయం ఇన్వెస్టిగేట్ చేసి ఆ గ్రూపు ఉనికిని ధృవపరిచారు...." అన్నాడు భానోజీరావు.

"అయిదుగురు పొరపాటుపడినంతమాత్రాన ఒక్కడు తెలుసుకున్న నిజం నిజం కాకుండా పోతుందా? నిజం విషయంలో డెమోక్రసీ పనికిరాదు"అన్నాడు మోహన్.

"మీరు రాజకీయాల గురించి మాట్లాడుతున్నారు. నేను స్టాటిస్టిక్స్ గురించి మాట్లాడుతున్నాను. ఒకే విషయంమీద ఆరుగురు పరిశోధించినపుడు — అందులో అయిదుగురిది ఒకటిగానూ, ఒకడిది వేరుగానూ ఉన్నప్పుడు నిజం యెవరిదయే అవకాశముంటుందీ అని యోచిస్తున్నాను...." అన్నాడు భానోజీరావు.

"పరిశోధనకు యోచన అవసరం. అయితే ఆ యోచన వల్లనే పరిశోధన పూర్తికాదు. సపోర్టింగ్ ఎవిడెన్స్ కావాలి—" అన్నాడు మోహన్.

"ఒప్పుకున్నాను—" అన్నాడు భానోజీరావు— "స్కెలిటన్ గ్రూప్ ఉనికిని నిరాకరించిన అయిదుగురూ వెనువెంటనే మరణించారు. లేదన్న మీరు బ్రతికారు. లేదని బ్రతికారా, బ్రతికి లేదన్నారా అన్నది మీనుంచి తెలుసుకోవాలనుకుంటున్నాను—"

మోహన్ ముఖం అదోలాగై పోయింది—"ఈ రకం ప్రశ్న మొదటిసారిగా మీనుంచే వింటున్నాను—" అన్నాడతను.

భానోజీరావు మాట్లాడలేదు.

"స్కెలిటన్ గ్రూప్ గురించి తెలుసుకునే అవకాశం మీకు కలగజేస్తాను. అప్పుడు అన్నీ మీకే అర్థమవుతాయి—" అన్నాడు మోహన్.

"అయితే ఆ గ్రూపు వుందంటారా?"

"అది మీరే నిర్ణయించుకుందురుగాని...." అన్నాడు మోహన్.

"అంటే?"

"మనం ఇద్దరం కలిసి ఈ కేసు పరిశోధిద్దాం. స్కెలిటన్ గ్రూపు గురించి మీకున్న అనుమానాలన్నీ తీరిపోతాయి—"

"పరిశోధించడమంటే ఎలా?"

"ముందు గోపాలం హత్యకేసుతో ప్రారంభిద్దాం.." అన్నాడు మోహన్.

"ఆ కేసు గురించి మీరు విన్నారా?"

"వినడమేమిటి? అది పరిశోధిస్తూనే మీరిక్కడకు

వచ్చారని నాకు తెలుసు—" అన్నాడు మోహన్.

భానోజీరావు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

7

యాక్సిడెంట్ చేసిన లారీ దొరికింది. అది చిత్రాడ ప్రాంతాల రోడ్డు పక్కన వదిలిపెట్టబడి వుంది. డ్రైవరు లేడు.

క్షణాలమీద వాకబులు జరిగాయి. లారీ వరాలయ్యది.

భానోజీరావు వరాలయ్యను కలుసుకున్నాడు.

"లారీలో వున్నది డ్రైవర్ రాములు. వాడు రాజమండ్రినుంచి మామిడి పళ్ళు తీసుకుని రావలసి వుంది. ఏ కారణంవల్లనో యాక్సిడెంట్ చేసి ఆ భయంతో పరారీ అయ్యాడు—" అన్నాడు వరాలయ్య.

భానోజీరావు ఆయనకు హత్య జరిగిన స్థలంలో దొరికిన తాళాలగుత్తి చూపించి—"దీని గురించి మీరేమైనా చెప్పగలరా?" అన్నాడు.

వరాలయ్య అది పరిశీలించి చూసి—"ఇది స్కెలిటిన్ గ్రూపుకి చెందివుండవచ్చు—" అన్నాడు.

స్కెలిటిన్ గ్రూపు అన్న పేరు వరాలయ్య నోటి నుంచి వింటానని భానోజీరావు ఊహించలేదు—"ఆ గ్రూపు గురించి మీకు తెలుసా?" అన్నాడు ఉత్సాహంగా.

"ఆ గ్రూపుకూ నాకూ ముడి వున్నట్లు జనం చెప్పుకుంటారని కూడా నాకు తెలుసు—" అన్నాడు వరాలయ్య.

"అయితే అది నిప్పు లేకుండా వచ్చిన పొగ అంటారా?"

"కాదు—" అన్నాడు వరాలయ్య—"నేను వ్యాపారస్థుణ్ని. అన్నీ న్యాయమార్గాన చేయడం కావాలన్నా నాకు సాధ్యపడదు. కొందరు రాజకీయ నాయకులు, ప్రభుత్వోద్యోగులు నన్ను బలవంత పెట్టి నాకిష్టంలేని పనులు చేయిస్తూంటారు నాచేత. నా మనుగడను దృష్టిలో వుంచుకుని నేనందుకు ఒప్పుకోవలసి వస్తూంటుంది....

"అలాంటి వారి కొందరి పేర్లు చెప్పగలరా?"

"చెబితే బ్రతకను...."

భానోజీరావు గంభీరంగా-"మీ ప్రాణాలు కాపాడే బాధ్యత నాది—" అన్నాడు.

"మీకు తెలుసో తెలియదో — స్కెలిటన్-గ్రూపు గురించి పరిశోధనకు దిగి అయిదుగురు పోలీసాఫీసర్లు ప్రాణాలు పోగొట్టుకున్నారు—" అన్నాడు వరాలయ్య.

భానోజీరావుకు ఏమనాలో తోచలేదు. కొద్దిక్షణాలు ఆలోచించి—"పోనీ — మీరెలాంటి ఇష్టంలేని పనులు చేశారో చెప్పగలరా?" అన్నాడు.

"ఆ మధ్య విశాఖపట్నంలో స్టేట్ బ్యాంకునుంచి ఇరవై లక్షలు దోపిడీ చేయబడ్డాయి. ఆ దొంగకు నేను ఒకరోజు మా యింట్లో రక్షణ కల్పించాను. ఆ ఇరవై లక్షల్లో ఒక్క రూపాయకూడా నాకు దక్కలేదు. నా బాధ్యత ఆదొంగలను ఒకరోజు కాపాడ్డంమాత్రమే. అందుకు ప్రతిఫలంగా ప్రభుత్వం నా జోలికి రాకుండా వుండడం మాత్రమే!"

"అంటే?"

"వ్యాపారస్థుల్ని బాధించడానికి ప్రభుత్వానికి లక్షా తొంభై మార్గాలున్నాయి. ప్రతిఒక్కటీ మాకు ప్రాణాంతకమే—" అన్నాడు వరాలయ్య.

"ఈ తాళాలు మీ లారీ డ్రైవర్‌వయుండాలి. అవి మీకు తెలియకుండా అతడి వద్దకు వచ్చాయా—లేక ...."

వరాలయ్య నవ్వి—"ఇవి మా లారీ డ్రైవర్‌వని నే ననుకోవడంలేదు. వాడు అత్యంత సామాన్యుడు. స్కెలిటన్ గ్రూపులాంటి ప్రమాదకర సంస్థల్లో పని చేసే మనిషి కాడు—" అన్నాడు.

"మరయితే హత్యా ప్రదేశంలోకివెలా వచ్చిందంటారు?"

వరాలయ్య నవ్వి — "మీకు తెలియకే నన్నడుగుతున్నారా? ఈ తాళాలగుత్తి హంతుడిది కావచ్చు. హత్య జరిగిన ఇంట్లో యెవరిదైనా కావచ్చు—" అన్నాడు.

"ఛీ— నేను నిజంగా ట్యూబ్ లైట్ నే—" అనుకున్నాడు భానోజీరావు. అతడికి మిత్రవర్గంలో ట్యూబ్ లైటు అన్న పేరుంది. ఆ పేరు పోగొట్టుకోవాలని అతడెన్నో ప్రయత్నాలు చేశాడు. డిపార్టుమెంట్లో సమర్థుడిగా పేరు తెచ్చుకున్నప్పటికీ మిత్రవర్గంలో మాత్రం అతడా పేరు పోగొట్టుకోలేక పోతున్నాడు.

"స్కెలిటన్ గ్రూపు గురించి ఇంకేమైనా చెప్పగలరా మీరు?" అన్నాడు భానోజీరావు.

"చెప్పడం నాకుగానీ, తెలుసుకోవడం మీకుగానీ మంచిదికాదు. స్కెలిటన్ గ్రూపు లేదనే అనుకోండి. మీకూ నాకూ చాలా మంచిది-" అన్నాడు వరాలయ్య.

"పోలీసు డిపార్టుమెంటంటే చాలామందికి భయంపోయింది—" అనుకున్నాడు భానోజీరావు. వరాలయ్య ఎంత సూటిగా మాట్లాడుతున్నాడు. అందుకు కారణం?

"నా మంచి చెడ్డలు నేను చూసుకుంటాను. మీకు తెలిసింది చెప్పండి—" అన్నాడు భానోజీరావు కాస్త

కోపంగా.

"హోటల్ యశ్వంత్ తెలుసా మీకు?" అన్నాడు వరాలయ్య.

హోటల్ యశ్వంత్ ప్రారంభమై రెండు సంవత్సరాలయింది. కాకినాడలో న్యూయార్క్‌లో వుండవలసిన హోటల్ వెలిసిందని అంతా దానిగురించి చెప్పుకుంటారు. భానోజీరావు ఆ హోటల్‌కెప్పుడూ వెళ్ళలేదు. డ్యూటీ మీద వెళ్ళవలసిన అవసరం యెన్నడూ రాలేదు. మామూలుగా వెళ్ళే స్తోమతు లేదు. ఒకరోజు కని సరదాగా వెళ్ళినా అంతా అనుమానిస్తారు. ఒక మామూలు పోలీసాఫీసరు అందులోకి వెళ్ళగలగడాన్ని డిపార్టుమెంట్లో హర్షించలేరు.

"తెలుసు—" అన్నాడు భానోజీరావు.

"ఆ హోటల్ ప్రొప్రయిటర్ శంకరానంద్‌కీ, స్కెలిటన్ గ్రూపుకీ ఏమైనా సంబంధముండి వుండవచ్చునని నా అనుమానం. అయితే ఇది కేవలం అనుమానం మాత్రమే!"

భానోజీరావు లేచి నిలబడి—"మీ డ్రైవర్ రాములు కోసం మేము ప్రయత్నిస్తున్నాం. మీ సహాకారం తప్పక వుంటుందని ఆశిస్తున్నాం—" అన్నాడు.

"తప్పకుండా—" అన్నాడు వరాలయ్య.

8

భానోజీరావు హోటల్ యశ్వంత్‌కు వెళ్ళలేదు. అతడు తానెక్కడ బయల్దేరానూ ఎక్కడకు చేరుకుంటాన్నానూ అని ఆలోచిస్తున్నాడు.

గోపాలం చచ్చిపోయాడు. వీధిలో ఓ పక్కగా మడత మంచం వేసుకుని పడుకుంటే లారీ గుద్దింది.

అది హత్యా? లేక యాక్సిడెంటా?

ఈ ఆలోచనతో పరిశోధన ప్రారంభించి స్కెలిటన్ గ్రూపులో అడుగుపెట్టాడు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌ని కలిశాడు. వరాలయ్యని కలిశాడు. ఇప్పుడు హోటల్ యశ్వంత్ గురించి విన్నాడు.

ఇందువల్ల తనేం సాధిస్తాడు?

స్కెలిటన్ గ్రూపు గురించి ఏమీ తెలియడంలేదు. అంతకంతకూ అయోమయమైపోతోంది. ముందు గోపాలం హత్య గురించి ఆలోచించాలి.

ఆ హత్య ఎలా జరిగింది?

ఆ హత్యకూ స్కెలిటన్ గ్రూపుకూ సంబంధమున్నదా?

భానోజీరావు తలపట్టుకున్నాడు.

అప్పుడు ఎవరో—"సార్!" అన్నాడు.

భానోజీరావు తలెత్తి చూశాడు.

"నా పేరు జగన్నాథమండి—" అన్నాడతను.

భానోజీరావు మాట్లాడకుండా అతడికంకే చూశాడు.

"మిమ్మల్ని అర్జంటుగా ఓ చోటుకు తీసుకుని వెళ్ళాలి—"

"ఎక్కడకు?"

"గుడి వీధికి—"

"ఎందుకు?"

"అక్కడో కాయన మిమ్మల్ని కలుసుకుంటారట—"

"ఎవరాయన?"

"పేరు తెలియదండి. కానీ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ చెప్పగా ఆయన మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటున్నారుట...." అన్నాడు జగన్నాథం.

భానోజీరావు తక్కున లేచాడు—"పద!" అన్నాడు.

ఇద్దరూ స్టేషన్ బయటకు వచ్చారు.

అక్కడో అంబాసిడర్ కారుంది. అదుపచ్చరంగు. కారులో వేరెవ్వరూ లేరు.

"నేనే డ్రైవ్ చేస్తానండి—" అన్నాడు జగన్నాథం.

భానోజీరావు వెనక సీట్లో కూర్చున్నాడు. కారు కదిలింది.

భానోజీరావు ఆలోచిస్తున్నాడు. ఎవరతను? తన కెలాంటి సమాచారం అందించాలని అనుకుంటున్నాడు.

ఉన్నట్లుండి కారు ఆగింది.

భానోజీరావు బయటకు చూశాడు. అది గుడివీధి కాదు.

"చిన్న ట్రబుల్ సార్—" అన్నాడు జగన్నాథం. కార్లోంచి దిగాడతను.

భానోజీరావు చుట్టూ చూశాడు. వీధి నిర్మానుష్యంగా వుంది.

జగన్నాథం ముందుకు వెళ్ళి బోనెట్ తెరిచాడు. భానోజీరావు అటే చూస్తున్నాడు.

అప్పుడిద్దరు వచ్చారు—కారుకు అటూ ఇటూ!

వాళ్ళను భానోజీరావు చూడలేదు. చూసేలోగా రెండుపక్కలనుంచీ ఇద్దరూ కార్లోకి మత్తుమందు స్ప్రే చేశారు. ఆ విషయం భానోజీరావుకు తెలిసిపోయింది. కానీ అప్పటికే ఆలస్యమయిపోయింది. అతడు తల పక్కకు వాల్చేశాడు.

జగన్నాథం బోనెట్ కిందకు దించాడు.

అతడు ముందుసీట్లో కూర్చున్నాడు. మత్తుమందు

స్వాగ్నచేసిన ఇద్దరూ వెనుక సీట్లో భానోజీరావుకు అటూ ఇటూ కూర్చున్నారు.

కారు కదిలింది.

9

"వెల్‌కం మిస్టర్ భానోజీరావ్—" అన్నా డతను.

భానోజీరావు కళ్ళు నులుముకుని చుట్టూ చూశాడు. ఆ ప్రదేశం అతడికి చాలా కొత్తగా వుంది.

"నే నెక్కడున్నాను?"

"రావలసిన చోటుకే వచ్చావు!" అన్నాడతను.

"ఎవర్నువ్వు?"

"నువ్వు చూడాలనుకుంటున్న వ్యక్తిని...."

"అంటే?"

"స్కెలిటిన్ గ్రూపు...."

భానోజీరావు తెల్లబోయి—"నువ్వు లీడరువా—" అన్నాడు.

"అలాగే అనుకోవచ్చు—" అన్నాడతను.

"నీ పేరు...."

"స్కల్!" అన్నాడతను.

"స్కల్!" అని తనలోతనే గొణుక్కున్నాడు భానోజీరావు

"ఏమిటి?" అన్నాడు స్కల్.

"స్కల్—అదేం పేరు—" అన్నాడు భానోజీరావు.

"అదీ ఒక పేరు—" అన్నాడు స్కల్ తాపీగా.

"నీ తలిదండ్రులు నీకా పేరు పెట్టివుండరు—" అన్నాడు భానోజీరావు.

"తలిదండ్రుల పేరు చెప్పగలవాళ్ళి దౌర్భాగ్య భారతదేశంలో ఎందరున్నా రంటున్నావు?" అన్నాడు

స్కల్.

"అంటే?"

"భారతదేశం జనాభా ఎనభై కోట్లు అనుకోవచ్చు. ఇందులో ఎంతమందికి తలిదండ్రుల పేర్లు తెలుసూ అంటున్నాను—" అన్నాడు స్కల్.

సంభాషణ తప్పుతున్నదని గ్రహించాడు భానోజీ రావు—"నన్నిక్కడికి ఎందుకు పిలిపించావు?"

"డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ నీ గురించి చెప్పాడు...."

"మోహన్—" అనుకున్నాడు భానోజీరావు మనసులో. అతడు తన డిపార్టుమెంట్లోని వ్యక్తి. కానీ అతడికి స్కెలిటన్ గ్రూపుతో సంబంధముంది. లేకపోతే ఈ విధంగా తానిక్కడికి రప్పించబడి వుండేవాడుకాదు.

"ఏమని చెప్పాడు?"

"నువ్వు నన్ను చూడాలనుకుంటున్నావని!"

"నేను నిన్ను చూడాలనుకోలేదు. పట్టుకోవాలనుకున్నాను...." అన్నాడు. భానోజీరావు.

"పోనీ—అందుకే....నిన్ను పట్టుకున్నాను...."

"అందుకే అంటే?"

"నీకు తెలుసో తెలియదో — ఇంతవరకూ ఏడుగురు పోలీసు ఇన్‌స్పెక్టర్లను నేను పట్టున్నాను. నువ్వు ఏడో వాడివి...."

అందులో అయిదుగురు పోయారన్న విషయం భానోజీరావుకు స్ఫురించగా అతడి వళ్ళు జలదరించింది. ఎంత సులభంగా వీళ్ళు తనని పట్టుకున్నారు?

"తెలుసు...."

"మేము పట్టుకున్న వారిలో ప్రాణాలతో వున్నవాడు మోహన్. ఆ తర్వాత అలాంటి అవకాశం నీకే వుంది."

"అవకాశం వున్నదా, సంపాదించుకోవాలా?"

"తెలివైన ప్రశ్న—" అని నవ్వాడు స్కాల్.

భానోజీరావు మాట్లాడలేదు. అతను చుట్టూ చూస్తున్నాడు.

అది అత్యంత ఆధునికంగా అలంకరించబడిన గది. అందులో ఎదురెదురుగా రెండు సోఫాలు. ఓ సోఫాలో స్కాల్. రెండో సోఫాలో తను!

"నీకు నేనేమీ చెప్పను. అంతా నీ అదృష్టంమీద ఆధారపడి వుంటుంది. నువ్వు మాతో ఇక్కడ కొంత సేపు గడుపుతావు. కొన్ని విచిత్రాలు చూస్తావు. పవిత్ర భారతదేశం గురించి కొన్ని నిజాలు తెలుసుకుంటావు. ఆ తర్వాత ఇక్కణ్నించి బయటపడతావు. అపైన అదృష్టముంటే బ్రతుకుతావు...." అన్నాడు స్కాల్.

భానోజీరావు అంతా మౌనంగా విన్నాడు.

• • •

"ఇది థియేటర్!" అన్నాడు స్కాల్. అక్కడ చలనచిత్ర ప్రదర్శనకు అనువైన ఏర్పాట్లన్నీ వున్నాయి.

ఓ పాతిక కుర్చీలు కూడా వున్నాయి.

కుర్చీల్లో స్కాల్, భానోజీరావు కూర్చున్నారు.

ఎదురుగా వెండి తెర!

ఉన్నట్టుండి గది చీకటైపోయింది. వెండితెర మరింత ప్రకాశవంతమైంది.

భానోజీరావు సినిమా చూస్తున్నాడు.

ముందు ఏదో సబ్బుల కంపెనీ అడ్వర్టయిజ్మెంట్!

ఓ ప్రముఖ చలనచిత్ర తార ఆ సబ్బు తన సౌందర్యా

స్నలా పెంచిందో వివరించింది. ఆమె స్నానం చేస్తున్న దృశ్యాలు ఎక్కడా అసభ్యత లేకుండా చిత్రీకరించ బడ్డాయి. అది ముగియగానే—"ఇది ప్రజలకోసం అన్న వాక్యాలు వచ్చాయి. ఆ తర్వాత తెరమీద ఓ ముఖం కనబడింది. తెర వెనుకనుంచి వ్యాఖ్యానం వినబడ సాగింది.

"ఈయన ప్రముఖులు. ఫిలిం సెన్సార్ బోర్డు మెంబరు. చలనచిత్రాల్లో అసభ్యతను ఏమాత్రమూ సహించరు. వీరి కారణంగా భారతీయ చలనచిత్రాల్లో నైతిక విలువల స్థాయి పడిపోకుండా ఆగిపోయింది....ఏదైనా చలనచిత్రం చూసినపుడు వీరు కొన్ని అభ్యంతరాలు చెప్తూంటాడు. ఆ అభ్యంతరాలు చెప్పకోదగ్గవికాదని నిర్మాతలు వారిని కన్విన్స్ చేయాలి. అదెలాగంటే?"

వ్యాఖ్యానం ఆగిపోయింది.

ఫిలింసెన్సార్ బోర్డు మెంబరు యిప్పుడు నడుస్తు న్నాడు. ఆయన ఓ గదిలో ప్రవేశించాడు. ఆ గదిలో....

ఇందాకా సబ్బు గురించి ప్రచారం చేసిన తార వున్నది.

ఇద్దరూ పరస్పరం చూసుకున్నారు.

మళ్ళీ వ్యాఖ్యానం ప్రారంభమయింది. వ్యాఖ్యానం తెరమీది నటుల నటనకు అనుగుణంగా వున్నది.

"సిద్ధమేనా—అంటున్నారు గౌరవసభ్యులు. సిద్ధమే అంటున్నది తారామణి. నా చిత్రంలో మీకు కనబడిన అభ్యంతరాలేమిటి—అంటున్నది నటీమణి. నిన్ను చూస్తే ప్రజల మనసులో ఎలాంటి సంచలనం కలుగుతుందో చూడాలని వచ్చాను—అంటున్నారు గౌరవ సభ్యులు.."

వ్యాఖ్యానం కొనసాగుతున్నది. భానోజీరావు చూస్తున్నాడు.

అతడు....ఆమె....

ఇద్దరూ పక్కనే వున్న స్నానాల గదిలో ప్రవేశించారు.

అదే గది....

ఇందాకా సబ్బుల కంపెనీ అడ్వర్టయిజ్ మెంటు కుపయోగపడిన స్నానాల గది....

తార స్నానానికి సిద్ధపడుతున్నది.

సెన్సారుబోర్డు సభ్యుడు చూస్తున్నాడు.

ఆమె బట్టలు విడిచింది. షవరు తిప్పింది. స్నానం చేస్తున్నది.

ఆమె చేతిలో సబ్బు. అదే సబ్బు! ఇందాకా ప్రచారాని కుపయోగపడిన సబ్బు....ఆ సబ్బుతో ఆమె వళ్ళు రుద్దుకుంటున్నది.

ఇందాకటి చిత్రానికీ ఈ చిత్రానికీ తేడా లేదు. ఎటొచ్చీ ఇందులోని కొన్ని సన్నివేశాలు మాత్రమే అందులోకి తీసుకోబడినాయి.

నటీమణిపై కెమేరా వేగంగా తిరుగుతున్నది. ఆమె సభ్యంగా కనబడినపుడు—ఇది ప్రజలకోసం....అనీ అసభ్యంగా కనబడినప్పుడు—ఇది గౌరవసభ్యునికోసం....అనీ వ్యాఖ్యాత చెబుతున్నాడు.

తార స్నానం ముగిసింది.

తెరమీద చీకటి....

గదిలో వెలుగు....

"తర్వాతేం జరిగిందో నీవు తెలుసుకోనవసరంలేదు. ఆ తార నటించిన సినిమా సెన్సారయిందని గ్రహిస్తే

చాలు....” అన్నాడు స్కాల్.

“ఏమిటిదంతా?” అన్నాడు భానోజీరావు.

“కొందరు తమ పదవుల నెలా దుర్వినియోగం చేస్తున్నారో తెలుసుకునేందుకు ఇదో మచ్చుతునక...” అన్నాడు స్కాల్.

“ఇది నువ్వు బయట పెట్టవా?” అన్నాడు భానోజీరావు.

“బయట పెట్టడంవలన ప్రయోజనం?”

“ఒక దోషి నిరూపించబడతాడు....”

“దోషి ఒక్కడే అయినప్పుడు నీవు చెప్పింది నిజం.”

“అంటే?”

“దోషికి పదవి వచ్చిందని నీవనుకుంటున్నావు. పదవి వచ్చిన ప్రతివాడూ దోషిగా మారుతున్నాడని నేను గ్రహించాను....”

“అయితే ఏం చేస్తావు?”

“దోషిని బయటపెట్టి నేను చేయగలిగిందేమీ లేదు. అందుకే దోషిని అదుపులో వుంచే సాధనాలకోసం వెతుకుతున్నాను నేను. ఆ గౌరవ సభ్యుడు కూడా తను నటించిన ఈ చిత్రం చూశాడు. నేనంటే అతడికిప్పుడు భయం!”

భానోజీరావు ఆలోచనలో పడ్డాడు.

“లైట్సాఫ్!” అన్నాడు స్కాల్.

మళ్ళీ గదిలో చీకటి.

తెరమీద వెలుగు....

ఆ వెలుగులోంచీ ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు.

వ్యాఖ్యానం ప్రారంభమయింది.

“దేశానికి ప్రధానమంత్రి కావాలన్నది ఈయన కల.

అది తీరడం కోసం ఏమైనా చేయాలన్నది ఈయన సంకల్పం. ఈయన సంకల్పబలం అసామాన్యం. ఈయన ఇప్పుడెవరితో మాట్లాడుతున్నారో చూడండి...."

ఉన్నట్లుండి తెరమీద ఓ విదేశీయుడు కనిపించాడు. వ్యాఖ్యాత అతడు సీఐఏ ఏజెంట్ అని చెప్పాడు.

ఆ నాయకుణ్ని భానోజీరావు గుర్తించాడు. అతడు ఒక్కసారి కూడా ప్రధానమంత్రి కాకపోయినా— అయే అవకాశమున్నదని కూడా ఎవరూ అనుకోవడం లేదు. దేశవ్యాప్తంగా అతడి పేరు ప్రచారంలో లేదు.

సీఐఏ ఏజంటుకు అతడు భారతదేశానికి సంబంధించిన కొన్ని రహస్యాలు చెబుతున్నాడు. అతడు వింటున్నాడు. వినడం పూర్తయ్యాక అతడో కాగితం ఇచ్చాడు. నాయకుడు దానిమీద ఓ అంకె వేశాడు.

ముప్పై వేల డాలర్లు.

అవి స్విస్ బ్యాంకిలోకి వెడతాయి.

వ్యాఖ్యాత కొనసాగిస్తున్నాడు — "ఈ నాయకుడి వెనుక అసలైన మరో ప్రముఖనాయకుడున్నాడు.... వీరిద్దరూ కలిసి...."

మళ్ళీ తెరమీద చీకటి....

గదిలో వెలుగు.

"ఇదీ మన దేశాన్నేలే ప్రజానాయకుల కథ...." అన్నాడు స్కల్.

"అంటే?" అన్నాడు భానోజీరావు.

"దేశభక్తి ప్రజలకోసం. దేశం నాయకుల కోసం. నీ దగ్గరున్న బంగారాన్ని నువ్వు అమ్ముకోవచ్చు. తాకట్టు పెట్టుకోవచ్చు. యేమైనా చేయవచ్చు .... నాయకులు దేశాన్ని స్వంత ఆస్తిలా వాడుకుంటున్నారని చెప్పడానికి

ఇదో మచ్చుతునక మాత్రం...."

భానోజీరావు మవసేదోలాగై పోయింది.

"మిష్టర్ భానోజీరావ్! ఇలాంటి ఆధారాలు నావద్ద కోకొల్లలు...."

"ఎలా సంపాదించావివన్నీ...." అన్నాడు భానోజీరావు.

"అది నీకు అనవసరం. కానీ నేను నిన్నో విషయం అడగదల్చుకున్నాను. నావద్దనున్న ఆధారాలలో కొన్ని నీకిస్తాను. ఏమైనా చర్య తీసుకోగలవా?" అన్నాడు స్కాల్.

"ష్యూర్!" అన్నాడు భానోజీరావు ఉత్సాహంగా.

"అప్పుడేమవుతుందో తెలుసా?"

"బహుశా నాకు ప్రమోషన్ వస్తుంది...." అన్నాడు భానోజీరావు.

"అవును ప్రమోషనే.... మోహన్‌కు ముందు ఆయిదుగురు ఇన్‌స్పెక్టర్సుకు ఈ లోకంనుంచి ఆ లోకానికి ప్రమోషన్ వచ్చింది...." అన్నాడు స్కాల్.

"ఏమిటీ?" అన్నాడు భానోజీరావు.

"వాళ్ళకు చిలక్కి చెప్పినట్లు చెప్పాను. దేశభక్తి అనే ఆవేశానికిలోనై తప్పటడుగులు వేయవద్దని! వాళ్ళు వినలేదు. ఫలితాలకు భయపడకుండా దోషుల్ని బయట పెడతామన్నారు. ఫలితంగా సాక్ష్యాలతోసహా దగ్ధమై పోయారు. కావాలంటే అందుకూ ఋజువులు చూపించగలను...." అన్నాడు స్కాల్.

మళ్ళీ గదిలో చీకటి....

తెరమీద వెలుగు....

ఈ పర్యాయం భానోజీరావుకూ జ్ఞానోదయమైంది.

"లైట్సాన్...." అతి దే అరిచాడు.

* * *

"మరి ఇంత ఘోరమా? అన్నీ తెలిసికూడా...."

"ఈ దేశంలో అన్నీ అందరికీ తెలిసే జరుగు తున్నాయి. అయినా ప్రజలు తెలిసి కూడా దోషులకే పట్టం కడుతున్నారు...." అన్నాడు స్కల్.

"ఇంతకీ నీ ఆశయం ఏమిటి?"

స్కల్ నవ్వి — "మనిషి అసలు స్వరూపం అస్థిపంజరం. దానిచుట్టూ రక్తమాంసాలు పోగై చర్మం కప్పితే మనిషి అవుతున్నాడు. ఆరంభంలో వున్నదీ, చివరకూ మిగిలేదీ అస్థిపంజరం మాత్రమే! మానవ జీవితానికి సంబంధించిన యథార్థానికీ హెచ్చరికగా వుండే స్కెలిటన్ పేరును నేను స్వీకరించాను. అందులో స్కల్‌ను నేనయ్యాను. అస్థిపంజరం భయంకరంగా, అసహ్యంగా వుండవచ్చు. ప్రతి మనిషిలోనూ అటువంటి యథార్థాలుంటాయి. ఆ యథార్థాల విషయంలో హెచ్చరికూ — వారిని అదుపులో వుంచడంకోసమే స్కెలిటన్ గ్రూపు ప్రారంభమైంది—" అన్నాడు.

"ఇంత పకడ్బందీగా వ్యవహారాలు నడుపగలుగుతున్న నువ్వు ఆ నేరాలను నువ్వెందుకు బయట పెట్టలేకపోతున్నావు?" అన్నాడు భానోజీరావు.

"దీనికి జవాబు ముందే చెప్పాను...." అన్నాడు స్కల్ —"దేశ నాయకులందరూ ఇంచుమించు దోషులే అయినప్పుడు అది బయట పెట్టడంవల్ల దేశంలో అరాచకమేర్పడుతుంది—"

భానోజీరావు ఆలోచిస్తూ—"అదీ నిజమే! అయితే మీ స్కెలిటన్ గ్రూపుకు చెడ్డపేరు రావడానికి

కారణం?" అనడిగాడు.

"అసలు మా గ్రూపు ఎక్కడా దేశవిద్రోహకర కార్యకలాపాల్లో పాల్గొనడం లేదు. అయితే దేశ విద్రోహకర శక్తులు పాలకవర్గంలో ప్రముఖ స్థానాలు వహించి వుండడంవల్ల ఏదోవిధంగా మా గ్రూపును దెబ్బ తీయాలని చాలామంది చూస్తున్నారు. ఎక్కడ ఎటు వంటి నేరం జరిగినప్పటికీ మా గ్రూపును ఇరికించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రత్యక్షంగా మాపై చర్య తీసుకునే దమ్మెవరికీ లేవు. అందుకని అవకాశం వచ్చినపుడల్లా ప్రతివారూ మా పేరు ఉచ్చరిస్తూంటారు. ఇందువల్ల ఎన్నో కేసులు తప్పుదారినిబట్టి పరిష్కరించ బడకుండా వుండిపోతున్నాయి—" అన్నాడు స్కల్.

"ఇప్పుడు నేనేం చేయాలి?" అన్నాడు భానోజీరావు.

"అది నీ అదృష్టం నిర్ణయిస్తుంది-" అన్నాడు స్కల్.

10

భానోజీరావుకు మెలకువవచ్చేసరికి ఓ గదిలో మంచం మీద వున్నాడు. అతడు గది పరిశీలించి చూసి ఆశ్చర్య పోయాడు.

ఆ గది ఎక్కడో చూసినట్లుంది.

"నేనిప్పుడెక్కడున్నాను?" అన్నాడు భానోజీరావు అప్రయత్నంగా.

"మనింట్లోనే—" ఓ గొంతు వినిపించింది.

"అరే— ఈ గొంతు కూడా ఎక్కడో విన్నట్లుందే" అన్నాడతను.

"ఎక్కడో విన్నట్లుండడమేమిటండీ — నేను మీ భార్యనైతే...."

"భానోజీరావుకు మత్తు పూర్తిగా విడిపోయింది.

తనిప్పుడు తిన యింట్లో తన భార్య సమక్షంలో వున్నట్లు గు ర్తించాడతను.

"నేనిక్కడికెలా వచ్చాను?"

"ఇద్దరు కాన్ స్టేబుల్సు మిమ్మల్ని స్పృహలేని స్థితిలో ఇంట్లో అప్పగించి కంగారేమీ లేదని చెప్పి వెళ్ళారు. అసలేం జరిగిందండీ—" అన్నదామె.

భానోజీరావుకు ఆశ్చర్యంగా వున్నది. తను చూసింది కలా, నిజమా అన్న సందిగ్ధంలో పడ్డాడతను. భార్యతో ఏమీ చెప్పకుండా కర్తవ్యం గురించి ఆలోచిస్తున్నాడతడు. అతడు తీవ్రాలోచనలో వున్నాడని గుర్తించి శ్రీమతి కూడా అతన్నింక మాట్లాడించలేదు. అయితే కొద్ది క్షణాల్లోనే ఆమె రావలసి వచ్చింది. అతణ్ని మాట్లాడించవలసీ వచ్చింది.

"మీకోసం ఎవరో వచ్చారు!"

"పేరు...."

"మోహన్...."

భానోజీరావు చటుక్కున లేచాడు. అతడికి మోహన్‌తో మాట్లాడవలెనని ఆత్రుతగా వున్నది.

తను కొందరు ప్రముఖుల రహస్యాలు తెలుసుకున్నాడు. ఇప్పుడేం చేయాలి?

మోహన్‌కి కూడా తనకులాంటి అనుభవమే ఎదురయిందా?

స్కెలిటన్ గ్రూప్ విషయమై ఏం చేయాలి?

అతను హాల్లోకి వెళ్ళాడు.

"హాల్లో భానోజీరావ్! నీ కేసు నేను పూర్తి చేశాను...." అన్నాడు మోహన్.

"నా కేసు ఏమిటి?"

"గోపాలం హత్యకేసు...."

భానోజీరావు ఆ విషయమే మరిచిపోయాడు. గోపాలం పేరు వినగానే ఉలిక్కిపడ్డాడు.

"పూర్తి చేశావా—అది యాక్సిడెంటేనా?"

"కాదు—హత్య..."

"హంతకుడెవరు?"

"డ్రైవర్ రాములు...."

"మోటివ్...."

"డబ్బు...."

భానోజీరావు కుర్చీలో కూలబడి—"కాస్త వివరంగా చెప్పు—" అన్నాడు.

"పదివేలకోసం రాములు ఈ హత్య చేశాడు...." అన్నాడు మోహన్.

"ఊఁ" అన్నాడు భానోజీరావు.

"సుధ సత్యాన్ని ప్రేమించింది. సత్యమంటే శేఖరానికి ద్వేషం. అందుకని చెల్లెల్ని గోపాలానికిచ్చి చేయాలనుకున్నాడు. అయితే అప్పటికే వాళ్ళిద్దరూ శారీరకంగా ఒకటైనారని తెలియడంతో శేఖరం అప్సెట్టయ్యాడు. అతడివద్ద డబ్బేమీ లేదు. గోపాలం అకౌంట్లో జతపడిన లక్షాయాభై వేలూ శేఖరం స్వంతం అవాలంటే గోపాలం చావాలి. ముగ్గురూ కలిసి పథకం వేశారు. సత్యం డ్రైవర్ రాముల్ని పట్టాడు. అంతా కలిసి హత్య జరిపించేశారు. గోపాలం పోగానే నువ్వు రంగంలోకి దిగావు. సగం నిజం, సగం అబద్ధం చెప్పి ముగ్గురూ నిన్ను కన్ఫ్యూజ్ చేశారు. పరస్పర ద్వేషం వున్నట్టుగా వాళ్లు నటించినా అది నటన మాత్రమే! డ్రైవర్ రాములుతో సహా అందరి దగ్గర్నుంచీ వాఙ్మూ

లాలు తీసుకుని రికార్డు చేశాను—" అన్నాడు మోహన్.

"సత్యాన్నీ, శేఖరాన్నీ ఎలా అనుమానించావ్!" అన్నాడు భానోజీరావు.

"అనుమానించడ మెందుకు—కేసు స్పష్టంగా కనబడుతూంటే! కేవలం స్కెలిటన్ గ్రూపు కారణంగా నీ బుర్ర పెడదారి పట్టింది...." అని—"మైడియర్ ఫ్రెండ్ ఒకే విషయం గుర్తుంచుకో నువ్వు. ఎప్పుడైనా ఎవరైనా ఇద్దరు ఒకే కేసులో నీ అనుమానాన్ని స్కెలిటన్ గ్రూపుమీదకు తోయడానికి ప్రయత్నించారో—వాళ్ళిద్దరూ లాలూచీ అని గ్రహించు—" అన్నాడు మోహన్.

"మెనీ—మెనీ—థాంక్స్...." అన్నాడు భానోజీరావు ఓ నిర్ణయానికివస్తూ.

—:అయిపోయింది:—